డ్రోన్‌.. వినియోగం పెరిగెన్‌!

- వ్యవసాయంలో విస్తరిస్తున్న వైనం
- డ్రోన్లతో రసాయన మందుల పిచికారీ
- డబ్బు, సమయం ఆదా

తాడిమర్రి: వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం రైతులు అందిపుచ్చుకుంటున్నారు. రోజు రోజుకు అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తుండటంతో పంటల సాగు సులభతరమవుతోంది. పంట సాగు నుంచి కోతలు కోయడం, నూర్పిడి, పంటను ఇంటికి చేర్చడం వరకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఇటీవల పంటలకు రసాయన మందుల పిచికారీ కోసం రైతులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో రబీ కింద వరి వేరుశనగ, మొక్కజొన్న, ఉలవలు తదితర పంటలు దాదాపు 13 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇక ఉద్యాన పంటలైన చీనీ, అరటి, మామిడి, సపోటా, జామ తదితర దాదాపు 29,500 ఎకరాల్లో సాగయ్యాయి.

కూలీల కొరతకు చెక్‌..

గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసే కూలీ కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పురుగు మందుల పిచికారీ చేయాలంటే పురుషులే కావాల్సి ఉంది. ఈనేపథ్యంలో డ్రోన్ల రంగ ప్రవేశం రైతులకు ఉపయుక్తంగా మారింది. చీనీ, అరటి, మామిడి, కంది, వేరుశనగ తదితర పంటలకు రసాయన మందులను పిచికారీ చేసుకోవడానికి కూలీల కొరత అధికంగా ఉంది. అంతేకాక ఐదెకరాల్లో అరటి పంటకు మందులను పిచికారీ చేయాలనుకుంటే సుమారు 50 డ్రమ్ములను పిచికారీ చేయాల్సి ఉంటుంది. అలాగే మందులు పిచికారీ కోసం నీరు పోయడానికి, మందులు కలపడానికి కనీసం నలుగురు, ఐదుగురు కూలీల అవసరం ఉంటుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల దాకా పని చేయాల్సి ఉంటుంది. డ్రోన్లతో మందులను పిచికారీ చేసుకోవడానికి ఒకరు ఇద్దరితోనే కేవలం గంట, గంటన్నర సమయంలోపే పని పూర్తి చేస్తున్నారు. చాలా మంది రైతులు అనంతపురంలో పలు రసాయన, ఎరువుల మందుల దుకాణదారులు రైతులకు డ్రోన్లను అద్దెకు ఇస్తున్నారు. దీంతో రైతులు వాటిని అధికంగా ఉపయోగిస్తున్నారు.


కునుకుంట్లలో అరటితోటకు డ్రోన్‌ ద్వారా మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

రబీలో ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా సాగైన పంటల వివరాలు(ఎకరాల్లో)		
మండలం	వరి, వేరుశనగ, మొక్కజొన్న	ఉద్యాన పంటలు
తాడిమర్రి	2,416	10,000
బత్తలపల్లి	2,100	6,500
ధర్మవరం	3,450	6,200
ముదిగుబ్బ	5,250	6,800

పని భారం తగ్గింది



పంటలకు డ్రోన్ల ద్వారా రసాయన మందులను పిచికారీ చేస్తుంటే పని భారం తగ్గుతోంది. అంతేకాక మందులు వృథా కావడం లేదు. అలాగే పైనుంచి మందు పిచికారీ చేయడంతో చెట్లు మొత్తం తడుస్తాయి. దీంతో తెగుళ్లు త్వరగా నివారణ అవుతున్నాయి. తక్కువ సమయంలో పని పూర్తి చేసుకుంటున్నాం. –సల్లాపురం బాలరమణారెడ్డి, కునుకుంట్ల, తాడిమర్రి

సబ్సిడీతో డ్రోన్లు



డ్రోన్లను 80 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మండలానికి ఇద్దరు రైతులకు 12 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించి 80 శాతం రాయితీతో వారికి డ్రోన్లను అందించనుంది. పంటలకు మందులను పిచికారీ చేసుకోదలసిన రైతులు వారి వద్దనుంచి డ్రోన్లను అద్దెకు పొందవచ్చు. మరో రెండు, మూడు నెలల్లో ఈ కార్యాచరణ పూర్తి కానుంది. –రమాదేవి, ఏఓ, తాడిమర్రి.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న హెచ్‌ఎం సిద్దారెడ్డి

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులు రూ.5 లక్షలతో క్రీడా మైదానం అభివృద్ధి పనులకు గురువారం హెచ్‌ఎం సిద్దారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఎంఈఓ క్రిష్టానాయక్‌, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌ రెడ్డినాయక్‌, ఉపాధ్యాయులు ముంతాజ్‌అలీ, విశ్వనాథరెడ్డి, రాజగోపాల్‌, చిన్నప్పయ్య, పీడీలు పాపారాయుడు, హరిప్రసాద్‌ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కదిరి అర్బన్‌: హార్ట్‌ టు హెల్ప్‌ ఛారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్షల కిట్‌ను అందజేశారు. కార్యక్రమానికి ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ హాజరయ్యారు. దాత బ్రహ్మానందరెడ్డి సాయంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ట్రస్ట్‌ చైర్మన్‌ రవినాయక్‌ తెలిపారు. మొత్తం 3 ప్రభుత్వ పాఠశాలల్లో 116 మంది విద్యార్థులకు కిట్లు అందజేశామన్నారు.

భద్రావతి భావన రుషీంద్రుల కల్యాణోత్సవం


చెరువులో గంగపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని మార్కెట్‌వీధిలోనున్న మార్కండేయస్వామి ఆలయంలో గురువారం భద్రావతి భావన రుషీంద్రుల కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభించారు. భద్రావతి భావన రుషీంద్రుల 59వ కల్యాణోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పద్మశాలియ బహుత్తమ సంఘం అధ్యక్షుడు పుత్తా రుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణ, ప్రధాన కార్యదర్శి మెటికల బాలకుళ్లాయప్ప, కోశాధికారి వడుకుల భాస్కర్‌ సమక్షంలో గోపూజ, మహా గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం గంగపూజ జరిపించారు. సాయంత్రం ధ్వజారోహణ పూజతోపాటు కూచిపూడి కళాకేంద్రం వారితో కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు కళ్యాణోత్సవం అనంతరం అన్నదాన, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నామని సంఘం సభ్యులు తెలిపారు. భక్తులు కల్యాణోత్సవాలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

రోగులకు అన్నదానం


రైల్వే విశ్రాంత ఉద్యోగి పుల్లయ్యను సన్మానిస్తున్న యువర్స్‌ ఫౌండేషన్‌ సభ్యులు

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో యువర్స్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో గురువారం రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి పుల్లయ్య రెండేళ్లుగా మొదటి గురువారం ఉచిత అన్నదానానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. దీంతోఆయన్ను యువర్స్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, ఫాస్ట్‌ ప్రెసిడెంట్‌ వైకే శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్‌, సహాయ కార్యదర్శి రమేష్‌బాబు ఘనంగా సన్మానించారు. అనంతరం 300 మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు.

మృతదేహం ఖననం అడ్డగింత


ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న అధికారులు

గాండ్లపెంట: తమ భూమిలో మృతదేహాన్ని ఖననం చేయొద్దంటూ ఓ వర్గం వారు అడ్డుకున్నారు. అధికారులు రంగ ప్రవేశం చేసి సమస్యను పరిష్కరించారు. వివరాలు.. వంకపల్లికి చెందిన ఓ వ్యక్తి రైలు ప్రమాదంలో బుధవారం మృతి చెందాడు. తూపల్లి పంచాయతీలోని తోపు పొరంబోకు(సర్వేనంబరు 767–6) భూమిలో మృతదేహాన్ని ఖననం చేసేందుకు సమాయత్తమయ్యారు. ఇంతలో తూపల్లికి చెందిన ఓ వర్గం వారు తమది భూమి అంటూ అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ బాబురావు, ఎస్‌ఐ వలీబాషా, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి ఇరు వర్గాలతో చర్చించారు. సదరు స్థలం ప్రభుత్వానికి చెందినదని ఎవరికి పట్టా మంజూరు చేయలేదని తెలిపారు. వంకపల్లి గ్రామస్తులు మూడు నెలల క్రితం రెవెన్యూ సదస్సులో శ్మశానానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇరువర్గాలను ఒప్పించి మృతదేహాన్ని ఖననం చేయించారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి


అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ అంజినప్ప

ఎన్పీకుంట: మండలంలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ఆంజినప్ప సిబ్బందికి సూచించారు. మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్‌ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని ఈ నెల 15న స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్‌ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, పంచాయతీ కేంద్రాలు, బస్టాండ్‌ ఆవరణ, తదితర ప్రదేశాలను పరిసరాలను శుభ్రపరచాలని సూచించారు. క్లాప్‌మిత్రలు రోజూ గ్రామాల్లో తడి,పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో వర్మికంపోస్టు తయారు చేసి పంచాయితీలకు ఆదాయం సమకూర్చాలని తెలిపారు. ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఎంఈఓ సుబ్బిరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్‌, ఏపీఎం వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండండి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్‌: సైబర్‌ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం రూరల్‌ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం రాత్రి ముచ్చురామి గ్రామంలో తన సిబ్బందితో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని, ప్రజలంతా కలిసి మెలిసి పరస్పర సహకారం అందించుకోవాలన్నారు. మద్యానికి బానిసలు కావొద్దన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అధిక దిగుబడులపై రైతులకు శిక్షణ


నల్లమాడ వద్ద కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

నల్లమాడ: మండల కేంద్రంలో గురువారం ఫ్రంట్‌ లైన్‌ డెమోన్‌స్ట్రేషన్‌ ఆన్‌ గ్రౌండ్‌ నెట్‌ ప్రోగ్రాం కింద రైతులు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు సత్యనారాయణ, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్‌ భాస్కర్‌రెడ్డి, డాక్టర్‌ రమేష్‌నాయక్‌, డాక్టర్‌ అనిత, సెంటర్‌ కోఆర్డినేటర్‌ రామసుబ్బయ్య శిక్షణ ఇచ్చారు. విత్తన సాగు నుంచి నూర్పిడి దశ వరకు రైతులు చేపట్టాల్సిన సాగు పద్ధతులు, అధిక దిగుబడి సాధించడంలో రైతుల పాత్రపై సలహాలిచ్చారు. వేరుశనగ, కంది, వరి, మొక్కజొన్న తదితర పంటలకు సోకే చీడపీడలు, వాటి నివారణ, యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఏఓ శంకర్‌నాయక్‌, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తు పత్రాలను అందించండి

ధర్మవరం: సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను ఈనెల 10లోపు మున్సిపల్‌ కార్యాలయంలో అందించాలని మున్సిపల్‌ కమిషనర్‌ ప్రమోద్‌కుమార్‌ గురువారం తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఒక సెట్‌ జిరాక్స్‌ కాపీలను హెచ్‌–1 క్లర్క్‌ రేవతికి అందించాలని సూచించారు.

బాలిక అదృశ్యం

ధర్మవరం అర్బన్‌: పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

15న చెన్నకేశవస్వామి తడకోత్సవం

పుట్టపర్తి అర్బన్‌: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి అటవీ ప్రాంతంలో వెలసిన చెన్నకేశవస్వామి తడకోత్సవం ఈ నెల 15న నిర్వహించనున్నారు. ఈ మేరకు తరుగు వంశీయులు, పూజారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాఘమాసం మూడో శనివారం స్వామి ఆలయంపై భాగాన తడక వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

సేవాలాల్‌ ఉత్సవాలకు తరలిరండి

ముదిగుబ్బ: ఈ నెల 13,14,15 తేదీల్లో గుత్తి మండలం సేవాఘడ్‌లో జరిగే సేవాలాల్‌ మహారాజ్‌ జయంత్యుత్సవాలకు తరలిరావాలని సేవాఘడ్‌ ట్రస్ట్‌ సభ్యుడు భూక్యా పీరునాయక్‌ కోరారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని బంజారా సోదరసోదరీమణులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: ఈదుల ముష్టూరు, సంగాల గ్రామాల్లో గురువారం ఏఎస్‌ఓ డాక్టర్‌ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈదుల ముష్టూరు గ్రామంలోని సర్వే నెంబర్‌ 47 రావి సావిత్రమ్మ పొలంలో కేవలం 920 గ్రాములు, సంగాలలో 8–3 సర్వే నెంబర్‌లో నారాయణమ్మ పొలంలో కేజీ రెండు వందల గ్రాములు దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏఈఓలు ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి

ఓడీచెరువు: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరగాలంటే తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని గౌనిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహమ్మద్‌ రియాజ్‌ పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో పాఠశాల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తల్లిదండ్రులు పబ్లిక్‌ పరీక్షలు ముగిసేంత వరకూ ఇళ్ల వద్ద పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకుదూరంగా ఉండాలి

అమడగూరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం అమడగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్‌, మద్యంతో జీవితాలు నాశనమవుతాయన్నారు.

రహదారి భద్రతపై అవగాహన


మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్‌

కదిరి అర్బన్‌: పట్టణంలోని వాల్మీకి పాఠశాలలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్‌, పట్టణ సీఐ నారాయణరెడ్డి, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయడం లాంటివాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రైవర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

కదిరి టౌన్‌: రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా కుటాగుళ్ల సమీపంలోని ఆర్టీఓ ఆఫీసులో వాహనదారులకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంవీఐ వరప్రసాద్‌ తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌, కిమ్స్‌ సవీరా హాస్పిటల్‌(అనంతపురం)సౌజన్యంతో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య పరీక్షలు చేయునట్లు తెలిపారు.

తలుపుల: రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద ఎంవీఐ వరప్రసాద్‌ వాహనదారులు, ఆటో, జీపుడ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. అంతకు ముందు శ్రీవాణి స్కూల్‌ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏఎంవీ రాజేష్‌, శ్రీవాణి స్కూల్‌ కరస్పాండెంట్‌ చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న టూటౌన్‌ సీఐ రెడ్డప్ప

అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు

ధర్మవరం: అతివేగంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని టూటౌన్‌ సీఐ రెడ్డప్ప పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ భద్రతా మాసోత్సవంలో భాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు టూటౌన్‌ సీఐ రెడ్డప్ప బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ డ్రైవింగ్‌ లైసెన్సు తీసుకోవాలన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి కేంద్రం రూ.5 వేలు రివార్డు అందించనుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ కరణం హర్షవర్ధన్‌, కళాశాల ఇన్‌చార్జ్‌ రమేష్‌, అధ్యాపకులు కృష్ణయ్య, హరీష్‌, శ్రీనివాసులు, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమా త్రిలింగేశ్వరుల స్వామి కల్యాణానికి తరలిరండి


ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్‌

ధర్మవరం: పట్టణంలోని పేట బసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగే ఉమా త్రిలింగేశ్వరుల స్వామి కల్యాణానికి తరలిరావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జెన్నే వెంకటేష్‌, ఉపాధ్యక్షుడు జెన్నే సురేష్‌కుమార్‌, కౌన్సిలర్‌ మాసపల్లి సాయికుమార్‌ కోరారు. స్థానిక త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణోత్సవంలో భాగంగా శనివారం ఉదయం గంగపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస శుద్ధ ఏకాదశి వార రుద్రాభిషేకం పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కమిటీ సభ్యులు పోతులనాగేపల్లి లక్ష్మినారాయణ, ఏకిల శ్రీనివాసులు, కుళ్లాయప్ప, రాము, గోపాల్‌, శీనా, గొల్ల గిరి, దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.

పొలానికి దారి చూపాలని వినతి

తనకల్లు: బొంతలపల్లిలోని తమ పొలాలకు దారి చూపాలని కోరుతూ చీకటిమానిపల్లికి చెందిన కిష్టప్ప, దళిత సంఘం నాయకులు గురువారం తహసీల్దార్‌ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు కిష్టప్ప మాట్లాడుతూ సర్వే నంబర్‌ 510 (1ఏ)లో తనకున్న 53 సెంట్లు స్థలం ఉందని, అయితే తమ పొలానికి పక్కన భూమి ఉన్న వ్యక్తి పొలంలోని వెళ్లడానికి దారి లేకుండా మొత్తం ఫెన్సింగ్‌ వేశాడన్నారు. మూడు నెలల క్రితం కూడా గ్రీవెన్స్‌లోనూ అర్జీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నాడు. రెవెన్యూ అధికారులు పరిశీలించి, పొలానికి దారి చూపాలని కోరాడు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు తోపు పారేసు, చంద్ర, రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


వీరభద్రస్వామి ఆలయం

పుట్టపర్తి అర్బన్‌: నిడిమామిడి గ్రామంలో శుక్రవారం వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో రూ.70 లక్షలు వెచ్చించి ఆలయాన్ని పునరుద్ధరణ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఉదయం కలశ స్థాపన, విగ్రహ శుద్ధి, ఊరేగింపు, అంకురార్పణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం ధ్వజారోహణం, మంటపం, ద్వారముల పూజ, ఆదివారం వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ స్థాపన, కుంభాభిషేకం, మహామంగళహారతి, అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

9న కంటి వైద్య శిబిరం


కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్‌ సభ్యులు

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 9న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్‌ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణలు తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో గురువారం కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. రోటరీక్లబ్‌ సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్‌, రత్నశేఖర్‌రెడ్డి, కొండయ్య, రామకృష్ణ, హరినాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

అడవులకు నిప్పుపెట్టొద్దు

గాండ్లపెంట: అడవులకు నిప్పుపెట్టొద్దని అటవీ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు. సాదులవాండ్లపల్లిలో గురువారం అటవీ శాఖ అధికారులు అగ్ని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను అగ్నిబారి నుంచి కాపాడుకోవాలని, అటవీయేతర, వ్యవసాయ భూముల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. చిట్టడవులు పెంచడం వల్ల సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం రాత్రి కొంత మంది అకతాయిలు గ్రామ సమీపంలోని బోగాదమ్మ కనుమ వద్ద నిప్పు పెట్టడంతో కొండ ప్రాంతం అగ్ని ఆహుతయిందన్నారు. వీఎస్‌ఎస్‌ సభ్యులు నాగేంద్ర, జయచంద్ర, గ్రామస్తుల సహకారంతో మంటలు అర్పివేశామని తుమ్మల బైలు బీట్‌ అధికారి బ్రహ్మయ్య తెలిపారు.